# తువాలును గూర్చిన పాఠాలు యోహాను 13:1-17

వ్యక్తిగతమైన తన పరిచర్య అంతటిలో-పరలోకపు కాల నిర్ణయ పట్టికను ప్రభువైన యేసు సూక్ష్మంగా ఎరిగినవారయ్యే ఉన్నారు. ఒక మహాత్కార్యం చేయుమని తన తల్లి ఆయన్ను అడిగినప్పుడు, ''-నా గడియ యింకను రాలేదని'' ఆయన అన్నారు (యోహాను 2:4). ఆయన పరిచర్యకాలంలో, ''ఆయన గడియ యింకను రాలేదు'' గనుకనే ఆయన శత్రువులు ఆయన్ను పట్టుకొన లేకపోయినట్లు పలుమార్లు సూచింపబడింది (యోహాను 7:30; 8:20). తన పరిచర్యలో చివరి దినాలకు వచ్చేసరికి, ''తన గడియ వచ్చినట్లు'' తిరిగి, తిరిగి నొక్కి చెప్పబడింది:

> అందుకు యేసు వారితో ఇట్లనెను-మనుష్యకుమారుడు మహిమ పొందవలసిన గడియ వచ్చియున్నది (యోహాను 12:23).
>
> తాను ఈ లోకమునుండి తండ్రియొద్దకు వెళ్లవలసిన గడియ వచ్చెనని యేసు పస్కాపండుగకు ముందే యెరిగినవాడై, లోకములోనున్న తనవారిని ప్రేమించి, వారిని అంతము వరకు ప్రేమించెను (యోహాను 13:1).
>
> యేసు ఈ మాటలు చెప్పి ఆకాశమువైపు కన్నులెత్తి యిట్లనెను-తండ్రీ, నా గడియ వచ్చియున్నది (యోహాను 17:1).

మన ప్రస్తుతపు పాఠం యోహాను 13నుండి తీయబడింది. సిలువయొక్క నీడ దీర్ఘాతి దీర్ఘంగా పెదుగుతున్న సంగతి ప్రభువైన యేసు విమర్శనా బుద్ధితో ఎరిగినవారైయున్నారు. ఆయన జీవించడానికి అప్పటికి పదిహేను గంటలకు తక్కువ కాలమే మిగిలియుంది. ఆ గడియ రాకముందు ప్రభువు తన శిష్యులతో అనేక సంగతులు పంచుకోవలసియుంది. ఆయన బహిరంగ చర్చలు ముగించ బడ్డాయి. అయితే మేడగది యొక్క అన్యోన్యతలో ప్రభువు తన శిష్యులను కలిసికొని, ప్రాముఖ్యమైన సత్యాలను వారితో చర్చించ గోరారు. బహిరంగంకాని ఈ క్షణాలలోని వివరాలను మత్తయి, మార్కు, లూకాలు దాఖలు చేశారు: ప్రభురాత్రి భోజనాన్ని సిద్ధపరచడం, ప్రభువు అప్పగింపబడబోయే దాన్ని గూర్చి ముందుగా చెప్పడం, ప్రభురాత్రి భోజనం యొక్క స్థాపనం వగైరాలను గూర్చి ఆ లేఖికులు చర్చించారు. యోహాను రచన తరువాత వచ్చింది. తెలిసిన సమాచారాన్ని తిరిగి చెప్పడానికి

యోహాను పూనుకోలేదు ( ప్రతి ఆదివారాన, సహోదరులు ప్రభురాత్రి భోజనంలో పాలుపొందు తున్నప్పుడు, ఆ సంఘటనలు బహిరంగంగా అప్పటికే ప్రదర్శింప బడుతున్నాయనేది నిస్సందేహం). అందువలన తన శిష్యులకు ప్రభువు యిచ్చిన వీడ్కోలు ప్రసంగాన్నీ (13-16 అధ్యాయాలు), దానివెంట తన శిష్యులకొరకు మనస్సు కరిగించేలా ఆయన చేసిన ప్రార్థననూ, యోహాను దాఖలు చేశాడు ( అధ్యాయం 17).

ఈ భాగం ప్రారంభమయ్యే సమయంలో, ప్రభువైన యేసుయొక్క గంభీరమైన ఉపన్యాసాన్ని అంగీకరించడానికి ఆయన శిష్యుల మనస్సులు సిద్ధపడని స్థితిలో ఉన్నాయి. అందువలన, 13 అధ్యాయం, ఆయన తన శిష్యుల పాదాలను కడగడం అనే సంభవంతో ప్రారంభింపబడగా,''తువాలును గూర్చిన పాఠాలను'' ఆయన వారికి నేర్పించారు. ప్రభువువారికి ప్రసాదించబోయే సవాలును ఎదుర్కొనేలా సిద్ధంగా ఉండడానికి ఆయన శిష్యులకు ఈ పాఠాలు అవసరమై యున్నాయ్. ప్రభువైన యేసు నేడు మన ముందుంచిన సవ్వాలును ఎదుర్కొనడానికి నీకు, నాకు కూడా ఈ పాఠాలు అవసరమే.

## అణకువను గూర్చిన పాఠం( యోహాను 13:1-5)

### యేసు తువాలును పట్టుకొన్నారు

యోహాను 13,17లు ప్రేమ అనే భావన మీద కేంద్రీ కృతమైయున్నాయి. ఈఅధ్యాయాల్లో ''ప్రేమ''అనే పదం 31పర్యాయాలు ప్రస్తావించబడింది. ప్రభువు తన శిష్యులపాదాలు కడగడానికి పరిచయంగా మాత్రమే గాక, యోహాను 13:1, ఈ అధ్యాయాలన్నిటికిని పరిచయంగా పనిచేస్తుంది.

> ''తాను ఈ లోకమునుండి తండ్రియొద్దకు వెళ్లవలసిన గడియవచ్చెనని యేసు పస్కాపండుగకు ముందే యెరిగినవాడై, (ఆ పండుగలోనే ప్రభువు మరణించారు) లోకములోనున్న తనవారిని ప్రేమించి, వారిని అంతము వరకు ప్రేమించెను''

ప్రేమించుమని ప్రభువు బోధించిన ప్రకారం నీవు ప్రేమించినట్లయితే, మరో విధంగా ఎవరూ నీకు చెల్లించలేనట్టు నీవు కార్యాలను జరిగిస్తావ్. (అంటే, ప్రేమ తిరిగి చెల్లించలేనంతగా పని చేస్తుంది).

''వారు భోజనము చేయుచుండగా ఆయనను అప్పగింపవలెనని సీమోను కుమారుడగు ఇస్కరియోతు యూదా హృదయములో అపవాది ఇంతకుముందు ఆలోచన పుట్టించి యుండెను'' అని 2వ వచనం గుర్తిస్తుంది. ఈ సంగతులు వివరించేటప్పుడు, ఇలాటి విశేషాన్ని ఎందుకు చెప్పవలసి వచ్చిందో? కొద్ది నిమిషాల్లో ప్రభువైన యేసు, యూదా పాదాలతో సహా, తన శిష్యులందరి పాదాలను కడుగ

బోతారు. ఆయన యూదా పాదాలు కడిగేటప్పుడు, యూదా ఏమి సంకల్పించు కొన్నాడో దాన్ని గూర్చి సంపూర్ణంగా ఎరిగినవారయ్యే ఆయన ఈ కార్యం జరిగించారని జ్ఞాపకముంచుకోవాలి!

ప్రభువైన యేసు యిలా చేసినట్టు 3వ వచనం చెప్పుతుంది. ''తండ్రి తన చేతికి సమస్తము అప్పగించెననియు, తాను దేవుని యొద్దనుండి బయలుదేరి వచ్చెననియు, దేవుని యొద్దకు వెళ్లవలసి యున్నదనియు యేసు ఎరిగి'' తానెక్కడ నుండి వచ్చారో, తానెవరో, తానెక్కడికి వెళ్లనైయున్నారో ఎరిగియున్న కారణాన, ప్రభువైన యేసు దాసుడుగా ఉండగలిగారు. బ్రీచన్ - ఫాక్నర్ యొక్క ''వివాహాన్ని మెరుగుపరచు'' అనే ఫిల్ములో - తనను గూర్చి తనకు నిశ్చయతగలవాడు, లేక తన స్థితిఏమో, తానెవడో ఎరిగినవాడు ''కసువు - కుప్ప'' ఎత్తివేయడానికి కూడా వెనుకాడడని నొక్కి చెప్పబడింది. మరోవైపు, తమమీద తమకే నమ్మకం లేనివారు నీచమైన పనులు చేయడానికి తమ్మును తామే అమ్ముకుంటారని కూడా అందులో సూచింపబడింది. అవి వాస్తవాలే! అయితే ప్రభువైన యేసుకు తానెవరో, తానెందుకు అవతరించారో బహుబాగా తెలియును గనుక ఆయన దాసుని స్వరూపం ధరించు కొనడంలో ఏ వింతో, విడ్డూరమో లేదు.

## సేవ చేయడానికి మోకాళ్లమీద వంగి పాదాలు కడుగవలసి వచ్చినప్పుడు, మనలో బహు ఎక్కువమంది, చేతులు కట్టుకొని హుందాగా నిలిచియుంటారు

''యేసు ... భోజన పంక్తిలోనుండి లేచి తన పైవస్త్రము అవతల పెట్టివేసి, యొక తువాలు తీసికొని నడుమునకు కట్టుకొనెను''(4 వ.). డావిన్సీ యొక్క ''రాత్రి భోజనం'' అనే దానిలో చిత్రింపబడినట్టు, వెనుకతట్టు నిచ్చెనను పోలిన కుర్చీలలో పొడవైన బల్లముందు యేసునూ, ఆయన శిష్యులును కూర్చుండియుండలేదు. కాని, సన్నని చాపపైనగాని, రగ్గుపైనగాని ఎడమవైపుకు మొగ్గినట్టు కూర్చుండి ఎడమ మోచేతులపై వాలి, కుడిచేతితో భోజనం చేస్తారు. రొట్టెను ముక్కలుగా తుంచి, వారి ఎదుట ఉంచబడిన ఆయా వంటకాలలో ముంచుకొని తింటూ ఉంటారు. ఈ దృశ్యాన్ని నీ మనస్సులో చిత్రించుకొని, ప్రభువైన యేసునూ, ఆయన శిష్యులునూ, ఎత్తులేని బల్లచుట్టు పంక్తిగా ఏర్పడి, వెనుకవాని ముఖసమీపానికి ముందటివాని కాళ్లు

వచ్చేలా కూర్చుండియుండడం చూడు! సంభవం జరిగిన అలాటి దృశ్యంలోనుండి ప్రభువైన యేసు లేచి తన శిష్యుల యొక్క కాళ్లను కడుగ సిద్ధపడ్డారు.(ఆ భోజన సమయంలో ఎదుటివాని మురికి కాళ్లు వీని ముఖం దగ్గరకు వచ్చి ఉంటాయ్).

గనుక కాళ్లు కడగడమనేది ఆ దినాల్లోని అవసరమైన సాంఘీక దృశ్యంలో భాగమైయుంది. (ఎవరైనా) ఒకరు భోజనానికి పిలువబడినప్పుడు, అరకాలునుండి నడినెత్తివరకు స్నానం చేసినవాడై శుద్ధిగా భోజనానికి బయలుదేరుతాడు. ఏది ఎలాగున్న, పాలస్తీనాలో మార్గాలు మురికిగా ఉంటాయి (జంతువులు కూడా ఆ మార్గాలనే ఉపయోగిస్తాయనే వాస్తవాన్ని మరచిపోకండి). ఒకవేళ వర్షమే వచ్చిందనుకో, రోడ్లు బురదగా ఉంటాయ్. అందరూ చెప్పులు వేసుకునేవారు గనుక, అతిథి విందుచేసినవారి యింటికి వచ్చేసరికి, తన తలనుండి మోకాళ్లవరకు శుద్ధంగానే ఉంటాడు, అయితే అతని పాదాలు, చీలమండలు సాధారణంగా దుమ్ముకొట్టుకొని ఉంటాయి. భోజనానికి పిలిచిన వ్యక్తి మర్యాదస్థుడైతే, తన యింటి ద్వారం నొద్ద నీళ్లతో నింపబడిన యొక పాత్ర, చెంబు, తువ్వాలు వగైరాలను ఏర్పాటు చేసియుంటాడు. అతిథి యింట ప్రవేశింపకముందు చెప్పులు విడుస్తాడు; ఎవరో ఒకరు అతని కాళ్లు కడుగుతారు. కాళ్లు కడగడమనేది హీనమైన పని గనుక, సాధారణంగా ఈ పని బానిసవాడు చేస్తుంటాడు. అదికూడా, హెబ్రీ బానిసలైతే అతిథుల కాళ్లు కడిగేలా బలవంత పెట్టబడరు; అన్య బానిసలే ఈ పని చేయ నాజ్ఞాపింపబడతారు. అతిథుల కాళ్లు కడిగే బానిసలు ఒకవేళ తన యింట లేకపోతే, మర్యాదస్తుడైన యింటి యజమానుడే అ పని చేస్తుండేవాడు (అయితే ఈ మేడగది లాంటి సందర్భంలో). యింటి యజమానుడే లేకుంటే, అతిథులు సాధారణంగా ఒకరి పాదాలను మరియొకరు కడుగుకునేవారు. ఇలా పాదాలు కడుగుకోకుండ భోజనానికి ఒకరివైపు మరొకరు ఒరగటమనేది సహజంగా జరుగని పని.

మరి బల్లచుట్టు కాళ్లు కడుగుకొనకుండే శిష్యులు ఎలా చేరారు? వారు భోజనం చేసేటప్పుడు, ''తనలో ఎవడు గొప్పవాడుగా ఎంచబడతాడో అనే వివాదము వారిలో'' పుట్టినట్టు లూకా మనకు తెలుపుతున్నాడు (లూకా 22:24). అంద్రెయ అంటున్నాడు: ''నేను మొదిటిగా పిలువబడ్డా''! యోహానంటున్నాడు: ''నేను (ఆయనకు) ప్రియుడను!'' పేతురు అంటున్నాడు: ''నాకు రాజ్యపు తాళాలు యివ్వబడ్డా!''యని! ఆ గదియంతా, మురికి పాదాలతోను, గర్వపు హృదయాలతోను నింపబడ్డాయి. నీవు వారి మాటలను వినలేవా? వారు సింహాసనం కొరకు దెబ్బలాడ గలరుగాని, తువాలు కొరకు కాదు. అలాగున, ప్రతివాడి మురికి కాళ్ళు తన ప్రక్కవాని ముఖం ఎదుటికి వచ్చి నిలిచియున్నాయి (నిజంగా వారా భోజనం చేయడానికి సిద్ధపడినట్టులేరు).

ఈ క్రింది మాటల వెనుక దాగియున్న సమాచారమిది! ఆ సందర్భంలో ''యేసు

... భోజన పంక్తిలోనుండి లేచి తన పైవస్త్రము అవతల పెట్టివేసి, యొక తువాలు తీసికొని నడుమునకు కట్టుకొనెను''(3-4 వచనాలు). యేసు తన పైవస్త్రము తీసివేసి అనేది, మనం మనకోటులను తీసివేసి, చొక్కాచేతులు పైకిలాగి, పని చేయడానికి సిద్ధపడినట్టిదన్న మాట. అప్పుడు ఆయన తువాలు తీసికొని నడుమునకు కట్టుకున్నారు. ఆయన వారి పాదాలు కడిగిన పిమ్మట వాటిని శుద్ధిగా తుడిచే దానికి అనువుగా, ఆ తువాలు ఆయన నడుముచుట్టు తిరిగి యింకా పొడవుగా ఉంచబడినట్టుంది.

''అంతట (ఆయన) పళ్లెములో నీళ్లుపోసి శిష్యుల పాదములు కడుగుటకును, తాను కట్టుకొనియున్న తువాలుతో తుడుచుటకును మొదలు పెట్టెను''(5 వ.). ప్రభువైన యేసు తన మోకాళ్లమీద ఒరిగి తన శిష్యుల పాదాలను కడుగ నారంభించిన సంఘటను ఊహించి చూడు! గొప్పవాడెవడో అనే వాదం నిలిచిపోయి యుంటుంది. మెల్లగా మాట్లాడేది కూడా తగ్గిపోయే ఉంటుంది; ధ్వనులన్నీ నిశబ్దమైయుండి ఉంటాయి, ఇక శబ్దం ఏదైనా వినిపించితే, ప్రభువైన యేసు వారికాళ్లను కడిగే శబ్దం మాత్రమే మిలిగియుండి యుంటుంది: అంటే- నీళ్లుపోసే శబ్దం, గట్టి తువాలుతో వారి కాళ్లను తుడిచే శబ్దం మాత్రమే- లేకుంటే ఆ మురికి నీరు వేరే దానిలో పోయడం, మంచి నీళ్లను పళ్లెంలో పోయడం, ఆయన గాలి పీల్చడం లాంటి శబ్దలే దాదాపుగా వినిపిస్తాయి. శిష్యులు తత్తరపోయి ఒకరి ముఖాలు ఒకరు చూచు కొనడం, సిగ్గుతో తలదించుకొనడం జరుగుతున్నట్టు నేను ఊహించగలను (ఎక్కడివారక్కడే స్తంభించిపోయినట్టున్నారు).

జోడు జోడు పాదాలను ఒకటి తరువాత ఒకటి, ప్రభువు కడుగుకొంటూ వెళ్లుతూ, సేవకులై యుండండి అనే పాఠాన్ని ఆయన వారికి బోధించారు. ఇందు మూలంగా ఆయన వారికి తెలియజేసే సమాచార మేమంటే -''మీరు నాకు శిష్యులై యుండగోరితే, మిమ్మును మీరు తగ్గించుకొనడానికి యిష్టపడినవారై యుండి తీరాలి!''(గత్యంతరంలేదు. శిష్యత్వానికి యిది అత్యవసరం).

ఆయన చేయనిష్టపడని దేనినీ తన శిష్యులు చేయాలని ప్రభువు కోరలేదు. యేసు పరలోకమునుండి వచ్చినప్పుడు ఆయన, ''... మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపమును ధరించుకొని, తన్ను తానే రిక్తునిగా చేసికొనెను. మరియు, ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి ... విధేయత చూపినవాడై, తన్ను తాను తగ్గించుకొనెను''(ఫిలిప్పీ 2:7-8). ఆయన పనిని గూర్చి ప్రభువైన యేసు మాట్లాడినప్పుడు ''మనుష్యకుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును, అనేకులకు ప్రతిగా విమోచనా క్రయధనముగా తన ప్రాణము నిచ్చుటకును వచ్చెనని చెప్పెను''(మత్తయి 20:28). తమలో ఎవడు గొప్పవాడో యని వారు వాదించుకునే సమయంలో ''... నేను మీ మధ్య పరిచర్య

చేయు వానివలె ఉన్నా''నని ఆయన వారికి తెలియజేశారు (లూకా 22:27).

## మనం కూడా తువాలు తీసికోవలసిన అవసరముంది

ఈ దినాల్లో అణకువను గూర్చి కేవలం నోటితో మాట్లాడడమే చేస్తుంటాం; అణకువ కలిగియుండమని బైబిలు బోధిస్తున్న సంగతి మనకు తెలుసు. అణకువ అనే సద్గుణం కేవలం మాటలతో వివరించేదో, నోటితో అభినందించేదో కాదన్నది వాస్తవం. ''అణకువ కలిగియుండడం'' ''అవమాన పరచబడడం'' అనే పదాలు ఒకే మూలంనుండి వస్తాయ్. ''నా జీవితంలో ఎన్నడూ అంతగా అవమానపరచబడలేదు!'' అనే మాటలను ఎవరైనా పలకడం దాదాపు నీవు వినే ఉండవచ్చు. అవమాన పరచబడడానికి, సిగ్గుపరచబడడానికి తత్తరపెట్టబడడానికి ఎవ్వరూ యిష్టపడరు; అయితే దీన్ని అర్థం చేసికో: ఒకరి కాళ్లు కడగటమనేది అవమానకరమైన అనుభవ మే! ఇతరులకు సేవచేయడం అనేది (గర్వాన్ని) అణిచేది మాత్రమే కాదు ఎదుటివాని దృష్టికి అది-అవమానకరమయ్యింది కూడా!!

సేవకులని పిలువబడడం మనలో ''అనేకులకు''అభ్యంతరంగా ఉండదు. ''ప్రభువు యొక్క గొప్ప సేవకులు'' అని ఎరుక చేయబడటంలో బహుగా ఆనందిస్తాం. అయితే, ''సేవకులుగా చూడబడడానికి ''మనం యిష్టపడతామా? క్రొత్త నిబంధన కాలంలో, సేవకులు దూషింపబడేవారు, తగని విధంగా ఉపయోగింప బడేవారు. సేవకులు అభినందింపబడేవారు కారు. సేవకుడు తన పని ముగించిన తరువాత, ఎంత తరచుగా తన యజమానుడు వానిని మెచ్చుకొని యుంటాడని నీవు అనుకొంటావ్? ''బానిసా, వందనాలు! నీవు బహు గొప్పగా పనిచేశావు; అందుకు నిన్ను నేను నిజంగా అభినందిస్తున్నా''నని యజమానుడు వాని మెచ్చుకుంటాడా? జవాబేదో నీకే తెలుసు: అలాగు ఎన్నడూ చేయడుగదా?

దాసులుగా ఉండడానికి మనం యిష్టపడుతున్నామా? ఇతరులకు సేవ చేసేలా మనలను మనమే తగ్గించుకొంటున్నామా? ఎవరూ చేయనిష్టపడని రోతపనులు మనం చేయ నిష్టపడుతున్నామా? ఇతరులు తమవంతు తాము చేయకపోయినా, యితరులు మనకు చేదోడుగా ఉండకపోయినా, సేవచేయడానికి మనం యిష్టపడుతున్నామా? ఇతరులు మనలను అభినందిస్తారనే భావనతో కాకుండ, అది మేలైనదనే ఉద్దేశంతో సేవచేయడానికి నీవు యిష్టపడుతున్నావా? (సేవకుడని పిలిపించుకొనడం ఒకవంతు-నిజంగా సేవకుడైనట్టు చూడబడడం మరోవంతు-ముందు దానికి యిష్టపడతాం-నిజంగా అలా చూడబడడానికి యిష్టపడం).

ఇలాటి సేవ కష్టమైనది. క్రైస్తవులకు ఏర్పరచబడిన పాఠ్య నిర్ణయంలో-అణకువ అనేది అతికష్టమైన పాఠ్య భాగమని ఒకరన్నారు. ఏది ఏమైయున్నా, అణకువ అనే పాఠాన్ని నేర్చుకోవలసిందిగా ప్రభువు మనలను కోరుతున్నారు. పరిసయ్యుల యొక్క గర్వాన్ని ప్రభువు ఖండించినప్పుడు, ''మీలో అందరికంటె గొప్పవాడు మీకు

పరిచారకుడై యుండవలెను, తన్ను తాను హెచ్చించుకొనువాడు తగ్గింపబడును; తన్ను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడునని'' ఆయన తెలియజేశారు (మత్తయి 23:11,12; యాకోబు 4:6). లోకం హెచ్చించుకో గోరుతుంది; యేసును వెంబడించేవారు సేవ చేసే అవకాశాలకొరకు వెదకుతున్నారు (లోకం హెచ్చువాటిని గుర్తిస్తుంది; పరలోకం తగ్గింపును గుర్తిస్తుంది).

## పరిశుద్ధతను గూర్చిన పాఠం (యోహాను 13:6-11)

### ఆత్మసంబంధమైన పరిశుభ్రత మనకవసరం

అలా తన శిష్యుల పాదాలను కడుక్కొంటూ, పెద్ద పాదాల జత దగ్గరకు వచ్చారు. ''ఇట్లు చేయుచు ఆయన సీమోను పేతురు నొద్దకు వచ్చినప్పుడు అతడు- ప్రభువా, నీవు నా పాదములు కడుగుదువా? అని ఆయనతో అనెను''(6 వ.). అవమానకరమైన బానిసయొక్క పనిని ఆయన ఎందుకు చేస్తున్నారో పేతురుకు అప్పటికి యింకా తెలియకున్నట్టుంది!

''అందుకు యేసు-నేను చేయుచున్నది ఇప్పుడు నీకు తెలియదుగాని యిక మీదట తెలిసికొందువని అతనితో చెప్పె''ను (7 వ.). ''నా మరణం, సమాధి, పునరుత్థానం, ఆరోహణం తరువాత పరిశుద్ధాత్మ వస్తాడు, అప్పుడు నీకీసంగతి అర్థమౌతుందని'' ప్రభువు అతనికి వివరించినట్టున్నారు.

అదెలాగున్నా, ఆ సమయంలో మాత్రం అది పేతురుకు అర్థం కాలేదు. అందువలన ''పేతురు- నీవెన్నడును నా పాదములు కడుగరాదని ఆయనతో అనెను'' (8వ.). ఆదిభాషలో ఈ ప్రతిపాదనకు రెండు వ్యతిరేకార్థ పదాలున్నాయి. ఇంగ్లీషులోనైతే రెండు వ్యతిరేకార్థ పదాలు ఒకదాని నొకటి కొట్టివేస్తుంది. అదే గ్రీకులోనైతే అవి వ్యతిరేకార్థాన్ని పెంచుతాయ్. ''ఎన్నటెన్నటికిని, నీవు నా పాదములు కడుగకూడదని'' పేతురు (ప్రభువుతో) అక్షరార్థంగా అన్నాడు!

''అందుకు యేసు-నేను నిన్ను కడుగనియెడల నాతో నీకు పాలు లేదనెను'' (8 వ.). ఈ విషయంలో పేతురు ప్రభువుకు లోబడకుండినట్లయితే, వారిద్దరికి సహవాసముండేది కాదు. అయితే పేతురు ఏ పనినైనా సగాలుగా (అర్థ భాగాలుగా) చేసేవాడు కాడు. గనుక అతడు, ''- ప్రభువా, నా పాదములు మాత్రమేగాక నా చేతులు నా తలకూడా కడుగుమని ఆయనతో చెప్పెను''(9 వ.). మరో విధంగా చెప్పాలంటే -''సరే ప్రభువా, నాకు స్నానం చేయించు! నీతో సహవాసం కలిగియుండడానికి అది అవసరమైతే, తలనుండి కాళ్లవరకు నన్ను కడుగు''మని పేతురన్నాడు.

''యేసు అతని చూచి- స్నానము చేసినవాడు పాదములు తప్ప మరేమియు కడుగుకొన నక్కరలేదు, అతడు కేవలము పవిత్రుడయ్యెను'' అని చెప్పారు.(10వ.).

ముందుగా మనం గుర్తించినట్టే, అతిథులు సాధారణంగా భోజనానికి ముందే స్నానం చేసియుంటారు. అందును బట్టి, వారు సంపూర్ణ శుద్ధులుగా ఉండడానికి పాదాలు మాత్రమే కడుగుకోవలసియుంటారు. పేతురు దేహంలో కడుగబడవలసింది అతని పాదాలు మాత్రమే.

దానితో ప్రభువైన యేసు ఒక గూఢమైన వాక్యాన్ని యిలా కలిపారు: ''నీవు పవిత్రుడవే, అయితే మీలో అందరు (పవిత్రులు) కారు''(10 వ.). అలాగున, పేతురుతో మాట్లాడిన సందర్భంనుండి, శిష్యులందరితో మాట్లాడే సందర్భానికి వచ్చారు. అప్పుడాయన యిలా అన్నారు; ''మీరును పవిత్రులు కాని మీలో అందరు పవిత్రులు కారు''(10b వ.).

ప్రభువు యొక్క భావాన్ని మనం ఊహించనవసరంలేదు. ఎందుకంటే, తరువాత వచనం సంగతిని యిలా వివరిస్తుంది: ''తన్ను అప్పగించువానిని ఎరుగును గనుక- మీలో అందరు పవిత్రులు కారని ఆయన చెప్పెను'' ''మీరందరు పవిత్రులుకారనే'' భావన, యూదాను సూచిస్తుంది. యూదాను మారుమనస్సుకు నడిపించే దానిలో యిది ప్రభువుయొక్క కడసారి ప్రయత్నమన్నట్టు తోస్తుంది.

ఏది ఎలాగున్నా, నేను నొక్కి చెప్పదలచుకున్న సత్యమేమంటే - ప్రభువు తన శిష్యుల పాదాలను కడగటంలో, దేహ సంబంధమైన శుద్ధికి ఆయన చూపిన అక్కరకు మించి, ఆత్మసంబంధమైన శుద్ధికే ఎక్కువ అక్కర చూపారన్నదే!! అది మన మనస్సులో ఉంచు కొన్నట్టయితే, 8వ వచనంలో ప్రభువు చేసిన ప్రతిపాదనకు లోతైన భావమున్నట్టు కన్పిస్తుంది: ''నేను నిన్ను కడుగని యెడల నాతో నీకు పాలుండదు'' ఆత్మసంబంధంగా, ఈ ప్రతిపాదన మనవిషయంలో కూడా సత్యమే- యేసు రక్తంలో- మనం కడుగబడని యెడల- ఆయనతో మనకు పాలుండదు! ప్రకటన 1:5లో-''మనలను ప్రేమించుచు, తన రక్తమువలన మన పాపములనుండి మనలను కడిగినవాడు'' యేసు క్రీస్తని వ్రాయబడింది.

దూరస్థులైన పాపులుగా, మనం క్రీస్తులోనికి బాప్తిస్మం పొందినప్పుడు, ఆయన రక్తంవలన మనం కడుగబడతాం. ''నీవు లేచి, ఆయన నామమునుబట్టి ప్రార్థనచేసి, బాప్తిస్మముపొంది, నీ పాపములను కడిగివేసికొనుమని'' అననియ సౌలుకు తెలియజేశాడు (అపొ. 22:16). ఆత్మసంబంధంగా, నడినెత్తినుండి అరకాలువరకు మనం కడుగబడిన తరువాత, అనుదినం జీవితం యొక్క మురికి, దుమ్ముల్లో గుండా నడిచిపోతాం. క్రైస్తవులంగా మనం ప్రభువుచే కడుగబడుతునే ఉండాలి. (వెలుగులో నడుస్తూవుంటే, కడుగబడడం జరుగుతూ ఉంటుంది).

> మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగిన వాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతినుండి మనలను పవిత్రులనుగా చేయును. మనము పాపము చేయలేదని చెప్పుకొనిన యెడల, ఆయనను

అబద్ధికునిగా చేయువారమగుదుము; మరియు ఆయన వాక్యము మనలో ఉండదు.

నా చిన్న పిల్లలారా, మీరు పాపము చేయకుండుటకై యీ సంగతులను మీకు వ్రాయుచున్నాను. ఎవడైనను పాపము చేసినయెడల నీతిమంతుడైన యేసుక్రీస్తు అను ఉత్తరవాది తండ్రియొద్ద మనకున్నాడు (1యోహాను 1:9-2:1).

### మనం లోబడియుండ నేర్చుకోవాలి

మన ఆత్మలు శుద్ధీకరింపబడేలా ప్రభువును వెంబడించుటలో అనేక విషయాలను గూర్చి మాట్లాడుకోవచ్చు. అయితే, ఈ సందర్భంలో, ప్రభువు పేతురును కడిగినప్పుడు ఆయన మనస్సులో ఒక ప్రత్యేకమైన విషయముంది. ఆ ఉన్న ప్రత్యేకమైనది; ''లోబడటం'' పేతురు శుద్ధిగా ఉండాలంటే, అతడు ప్రభువు చిత్తానికి లోబడాలి - అది అతనికి యిష్టం లేకపోయినా సరే- అతడు దానితో అంగీకరించక పోయినా సరే- అది అతనికి అర్థం కాకపోయినా సరే!

మనలో అనేకులవలె, పేతురు తన గర్వంతో పోరాడుతున్నాడు లేక దానితో సతమతమౌతున్నాడు. పేతురుకు ఆ సంగతి తరువాత గ్రహింపౌతుందని ప్రభువు తెలిపారు. చివరికి పేతురుకు తువాలు యొక్క పాఠం అర్థమైనట్టుంది, అందుకే యిలా వ్రాస్తున్నాడు:

> చిన్నలారా, మీరు పెద్దలకు లోబడియుండుడి; మీరందరు ఎదుటివాని యెడల దీనమనస్సు అను వస్త్రము ధరించుకొని మిమ్మును అలంకరించుకొనుడి; దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును. దేవుడు తగిన సమయమందు మిమ్మును హెచ్చించునట్లు ఆయన బలిష్ఠమైన చేతిక్రింద దీనమనస్కులై యుండుడి (1పేతురు 5:5-6).

నేను, నీవు నిరంతరం ప్రభువైన యేసు రక్తంచేత శుద్ధీకరింపబడవలె నంటే, విధేయతతో కూడిన జీవిత విధానాన్ని అనుసరిస్తూ ఉండాలి. ''ఆయన వెలుగులో నున్న ప్రకారము మనమును వెలుగులో నడిచిన యెడల, మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును'' (1యోహాను 1:7).

## ఆనందాన్ని గూర్చిన పాఠం (యోహాను 13:12-17)

### మనం ''పాదాలు కడుగ'' నేర్చుకోవాలి

ఆఖరి పాదం; చివరి బొటన వ్రేలితో సహా కడుగబడి, తుడువబడింది. తాను చేసినదేమో వివరించి, తన శిష్యులకు దాన్ని వర్తింపజేయడానికి ప్రభువు సిద్ధంగా ఉన్నారు. ''వారి పాదములు కడిగి తన పైవస్త్రము వేసికొనిన తరువాత, ఆయన

మరల (బల్లయొద్ద) కూర్చుండి'' వారితో మాట్లాడ సాగారు. ప్రభువైన యేసు పళ్లాన్ని, జగ్గును అవతలపెట్టి, ఆయన తన పైవస్త్రాన్ని మరలా వేసికొన్నారు. ఇప్పుడు ప్రతి కన్ను యేసుమీదనే ఉంది, తన శిష్యుల యొక్క శ్రద్ధను ఆయన పొందారు.

ఆయన బల్లవద్ద తన స్థలానికి వెళ్లినప్పుడు, ''నేను మీకు చేసిన పని మీకు తెలిసినదా?'' అని ప్రశ్నించారు (12b వ.). ''అదేమి వింతైన ప్రశ్న? మీరు మాకు చేసినది మాకు బాగా తెలుసు. మీరు మా పాదములు కడిగారు!'' అని వారు బదులిచ్చియుండేవారే, అయితే, ''నేను చేసింది మీకు నిజంగా తెలిసిందా? నేను చేసినదేమో, అది ఎందుకు చేశానో మీరు నిజంగా గ్రహించారా?'' అనేది ఆయన భావం.

అప్పుడు యేసు దానిని వారికి వర్తింపజేయ మొదలు పెట్టారు: ''బోధకుడనియు ప్రభువనియు మీరు నన్ను పిలుచుచున్నారు; నేను బోధకుడను ప్రభువును గనుక మీరిట్లు పిలుచుట న్యాయమే. కాబట్టి ప్రభువును బోధకుడనైన నేను మీ పాదములు కడిగిన యెడల మీరును ఒకరి పాదములను ఒకరు కడుగవలసినదే''(13-14 వచనాలు). అది న్యాయం. ఆయన 24 మురికి కాళ్లు, 120 మురికి వేళ్లు కడిగారు. అయితే ఆయన కాళ్లు యింకా మురికిగానే ఉన్నాయ్. వారు ఆయన కాళ్లు కడగడం న్యాయం (ప్రభువైన యేసు పాదాలు కడగడానికి మనలో ఎవరికీ అభ్యంతరముండదు. దాని కొరకు దాదాపుగా మనం బారులు తీరే ఉండవచ్చు). దానికి బదులు, ''మీరును ఒకరి పాదములను ఒకరు కడుగవలసినదే. నేను మీకు చేసిన ప్రకారము మీరును చేయవలెనని మీకు మాదిరిగా ఈలాగు చేసితిని''(14b -15 వచనాలు).

ఇలా కాళ్లు కడుగమని నిజంగా ప్రభువైన యేసు మనలను కోరారా? ఒకవేళ అలా కోరినా అది అంత ఓగైన దేమీకాదు. మన స్నేహితులలో కొందరిని కూర్చుకొని, ఒకరి కాళ్లను ఒకరు కడుగు కొనవచ్చు. ప్రభువైన యేసు, ''ఒక నిమిషం ఆగు'' అని అంటున్నారు. ''నేను చేసినట్టు మీరుకూడా చేయాలి'' అని ఆయన ఆదేశించారు. యూదా మిగిలిన శిష్యులతో కలిసే ఉన్నాడు. ప్రభువైన యేసు యూదా కాళ్లను కడిగిన దాన్ని గూర్చి నీవేమనుకుంటావ్? యూదా తనను అప్పగించబోతాడని ప్రభువుకు ముందే తెలుసు. అతని చర్మం ఊడిపడేలా సలసల మసిలే వేడినీళ్లు పోయాలనిగాని; లేక మంచుగడ్డలతో కూడిన నీళ్లు పోయాలని గాని నేను శోధింప బడేవాడనే. లేక అతని పాదాలు తుడిచేటప్పుడు తన తోలు ఊడివచ్చేలా రుద్దేవాడనే! తక్కిన పాదాలకు ప్రభువు ఎలాటి శ్రద్ధ వహించారో, యూదా పాదాలకు కూడా అలాటి శ్రద్ధనే కనుపరచారు. ప్రభువైన యేసు యొక్క మాదిరి-స్నేహితుల పాదాలను కడగడానికి మాత్రమే గాక, శత్రువుల పాదాలు కడగడానికి కూడా నన్ను సిద్ధపడ మంటుంది.

తన మాటలను ప్రభువు యిలా కొనసాగించారు: ''దాసుడు తన

యజమానునికంటె గొప్పవాడుకాడు, పంపబడినవాడు తన్ను పంపినవానికంటె గొప్పవాడు కాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను''(16 వ.). దీనితో ప్రభువు మనలను నిరుత్తరులనుగా (అంటే సమాధానం చెప్పలేని వారినిగా) నిలబెట్టారు? స్నేహితులు, శత్రువులనే భేదం లేకుండ ఆయన వారి పాదాలను కడిగినప్పుడు, మనం కూడా ఆ పని చేయగలిగియుండాలి.

ఇక్కడ కొంతసేపు ఆగి, ''మనం ఒకరి పాదాల నొకరు కడుగుకొనవలసిందే'' అని ప్రభువు అన్నప్పుడు, ఆయన ఏ భావంతో ఈ సంగతి చెప్పారు?''తెలిసి కొనవలసి వస్తుందనుకొంటాను. మన ఆరాధనా కార్యక్రమంలో కాళ్లుకడగడం అనే కార్యకలాపం ఒక భాగమైయుండాలని ఆయన భావించారా? కొన్ని గుంపులు ఈ పనిని చేస్తాయి. వారు ప్రభురాత్రి భోజనాన్ని (మూడు నెలలకొక సారి, సంవత్సరాని కొకసారి, మరి యింకెప్పుడైనా) చేసేటప్పుడు, కాళ్లు కడగడమనే కార్యకలాపాన్ని జరిగిస్తారు.

అలా పాలు పొందబోయేవారు గట్టిగా శుద్ధిచేసిన పాదాలకు మేజోళ్ళు తొడిగి పాలీషుచేసిన బూటులో పెట్టుకొని వస్తారు. ఆ కార్యకలాప సందర్భంలో కాళ్లు కడిగేవారు శుద్ధిగా ఉన్న కాళ్లనే కడగడానికి వరుసలో నిలుస్తారు. మురికి కాళ్లు కడగడమనే అసలు ఉద్దేశం ఎక్కడో పడిపోయింది.

ప్రభువు చేయుమని ఆజ్ఞాపించింది యిదేనా? మిగిలిన క్రొత్త నిబంధన అంతా ఒక్కసారి పరిశీలించి చూడు. మొదటి శతాబ్దపు రచయితల యొక్క యితర రచనలను పరిశీలించి చూడు. ఆది సంఘపు ఆరాధనలో ఆలాటి ఆచారం ఎన్నడూ జరిగి నట్టులేదు. సంఘంచే పోషింపబడడానికి సంబంధించిన విధవరాండ్ర యోగ్యత లను గూర్చి 1తిమోతి 5:9-10లో తెలియజేయబడింది - కాళ్లు కడగడమనేది వారి యోగ్యతల్లో ఒకటిగా అక్కడ చర్చించబడింది: ఎవరిని విధవరాండ్ర లెక్కలో చేర్చాలో సూచించిన లేఖన భాగమది.

> అరువది ఏండ్ల కంటె తక్కువ వయస్సు లేక, ఒక్క పురుషునికే భార్యయై, సత్ క్రియలకు పేరుపొందిన విధవరాలు పిల్లలను పెంచి, పరదేశులకు ఆతిథ్యమిచ్చి, పరిశుద్ధుల పాదములు కడిగి, శ్రమపడువారికి సహాయముచేసి, ప్రతి సత్కార్యముచేయ బూనుకొనినదైతే, ఆమెను విధవరాండ్ర లెక్కలో చేర్చవచ్చును.
>
> అనేక యోగ్యతలు యిందులో సూచింపబడ్డాయి. వీటిలో ఒక్కటే ఆరాధనా కార్యకలాపానికి సంబంధించిన దైయుంటే, తక్కిన వన్నీ ఆరాధనా కార్యకలాపానికి సంబంధించినవైయుండి తీరాలి. అందువలన ఆరాధనలో కాళ్లు కడగాలన్న పద్ధతిని ప్రభువు ఉద్దేశింపలేదు.

ఒకవేళ ప్రత్యేకమైన కార్యకలాపాన్ని గూర్చి ప్రభువు సూచింపక పోయినట్లయితే, మీరు ఒకరి పాదాలను ఒకరు కడుక్కోవలసిందని ప్రభువు చెప్పినప్పుడు, ఆయన

ఏ ఉద్దేశంతో ఆ మాటలు చెప్పియుంటారు? చెర్లెస్ హడ్గే అనే రచయిత, సువార్తికుడు యిలా అన్నాడు : ''కాళ్లు కడగడం అనే అంశం మీద మనం వాగ్వివాదాన్ని గెలువ వచ్చునేమో- అయినా కాళ్లు కడగడాన్ని మనం యింకా నేర్చుకోలేకుండానే ఉన్నాం!'' అతడలా అన్నప్పుడు సరిగానే అన్నాడు.

క్రొత్త నిబంధన దినాల్లో కాళ్లు కడగడమనేది ఒక బానిసవాడు చేసే అవమాన కరమైన పని! ఇరవైయవ శతాబ్దంలో దానికి సమానమైనదేమంటే - యితరులకు సేవచేయడం - వారెవరైనా సరే - దాని ఖర్చెంతైనా సరే- ఆ పని ఎంతటి అయిష్టమై నట్టిదైనా సరే, దాన్ని జరిగించడమే.

రూత్ హార్మ్ కాకిన్ ''నేను ఆశ్చర్యపోయాను'' అనే పేరుతో పద్యం వ్రాయడం తటస్థించింది. మనలో ప్రతి ఒక్కరు అడుగవలసిన ప్రశ్నను ఆమె దానిలో అడిగింది! గమనించు:

ప్రభువా, నేను నిన్ను ఎలా సేవిస్తున్నానో, నీ వెరుగుదువు గదా
  గొప్ప ఉద్వేగంతో కూడిన తీవ్రతతో
  మిక్కిలి ప్రకాశవంతమైన కాంతిలో
నీ కొరకు ఎంత ఆసక్తితో నేను మాట్లాడుతున్నానో నీవెరుగుదువు
స్త్రీలయొక్క సమాజపు కట్టడంలో
వృద్ధి చేసేటప్పుడు నేనెలా పొంగిపోతానో నీకు తెలుసు
ఒక సహవాసపు గుంపును
నా యథార్థమైన పట్టుదల నీకు తెలుసు
బైబిలు పఠనం వద్ద.
అయితే, నేనెలాటి ప్రతిచర్య చూపుతానో అని ఆశ్చర్య పోతా:
నీవొక పళ్లెం యొక్క నీళ్లను గుర్తించి చూపి
కనికరములేని కాళ్లను నన్ను కడుగుమని కోరితే
ఒంగిపోయి ముడతలు పడిన ముసలి దానిని
రోజు తరువాత రోజు
నెల తరువాత నెల
ఎవ్వరూ కానని గదిలో ఎవ్వరికి తెలియని రీతిగా?

సేవ చేయడానికి మనం నేర్చుకున్నామా? హీనమైన పనులు, రోతైన కార్యాలు, చూడనింపితం కాని అప్పగింతలను చేయడానికి మనం నేర్చుకున్నామా? - తరచు కృతజ్ఞత చూపనివారికి, లేక కొన్నిసార్లు మనకు హానిచేయ ప్రయత్నించినవారికి? ప్రభువైన యేసు యూదా పాదాలు కడిగిన తరువాత కూడా ఆయన నప్పగించడా నికతడు మేడగదిని వీడిపోయాడు. అయినా సరే, ''ఒకరి పాదాల నొకరు కడుగు కొండని'' ప్రభువు మనలో ప్రతి ఒక్కరికి చెప్పారు!

లోకం ఏమని అడుగుతుందంటే, ''నీ క్రింద పనివాళ్లెంతమంది?'' అని! అయితే ప్రభువు- ''నీ వెంతమంది కొరకు పనిచేస్తావ్?'' అని అడుగుతున్నారు. సేవ

చేయడానికి మోకాళ్లమీద వంగి పాదాలు కడుగవలసి వచ్చినప్పుడు, మనలో బహు ఎక్కువమంది, చేతులు కట్టుకొని హుందాగా నిలిచియుంటారు.

**''కాళ్లు కడగటం'' ఆనందానికి బీగం**

''దానిలో నాకేముంది?'' అని సందేహవాది అడుగుతాడు. సేవచేయడానికి నేర్చుకుంటే అది మనకేమి చేస్తుందో 17వ వచనం చెప్తుతుంది. ప్రభువైన యేసు తన శిష్యులకు యిలా చెప్పారు:

''ఈ సంగతులు మీరు ఎరుగుదురు గనుక వీటిని చేసినయెడల మీరు ధన్యులగుదురు'' (17 వ.). ''నేను మీకు చేసిన పని మీకు తెలిసినదా?'' అని ప్రభువు తన శిష్యులను 12వ వచనంలో అడిగారు. ఇప్పుడువారికి తెలిసినదనే భావంతో- మీకు తెలిసినది క్రియా రూపాన్ని దాల్చినప్పుడు, మీరు ధన్యులగుదురని ప్రభువైన యేసు అన్నారు. ఇతరులకు సేవచేయాలని మనం గ్రహించితేనే చాలదు; దేవుడు మనలను దీవించాలంటే- మనం దాన్ని జరిగించాలి.

ఈ వచనంలో నేను నొక్కి చెప్పాలనుకున్నది ''దన్యులు'' అనే పదం. కొండమీద ప్రసంగంలో ధన్యతలలో కూడా యిదే పదం ప్రయోగింపబడింది (మత్తయి 5:3-12). వెలుపటి పరిస్థితులమీద ఆధారపడకుండగనే - అంతరంగమందు కలిగే సంతోషం, ఆనందం, సమాధానాలను గ్రీకు పదం సూచిస్తుంది. KJV తర్జుమావలె - ''మీరీ సంగతులు ఎరిగినవారైతే, మీరు వాటిని చేసినప్పుడు ఆనందిస్తారు''. లోతైన స్థిరమైన ఆనందానికి రహస్యం- సేవచేయ నేర్చుకొనడమే.

సేవ చేయించుకో కోరినవారు మిక్కిలి దౌర్భాగ్యులైయుంటారు. వారిని బాగా చూడలేదని భావిస్తారు, పొందతగింది వారికి లభించలేదని వారు తలంచుతూ ఉంటారు, వారు కోరింది దొరకలేదని అనుకొంటారు. ఎవరో దాన్ని వారికి యివ్వాలని వేచియుంటారు. అలాటివారు పరితాపకరమైన స్థితిలో ఉంటారు! నిరంతరం ఆనందించేవారు, తమ్మును సంతోషపరచుకో జూచేవారుకారు; కాని యితరులయొక్క సంతోషం, వారి క్షేమమందు అక్కరగలవారే! తువాలు నేర్పించే అతి ప్రాముఖ్యమైన పాఠాలలో యిది ఒకటి.

## ముగింపు

తువాలును గూర్చి యితర పాఠాలను గూడా గుర్తింపవచ్చు, అయితే - అణకువ, పరిశుద్ధత, ఆనందం - అనేవాటికంటే ప్రాముఖ్యమైనవేవి నిశ్చయంగా లేవు.

సేవకుని గూర్చి లోతుగా అంతరంగంలోనికి దూరే ఈ ప్రశ్నలను మనలో ప్రతి ఒక్కడు అడుకోవాలి. ''నేను ప్రభువును సేవిస్తున్నానా? నాతోటివానికి నేను సేవచేస్తున్నానా? దిన దినం సేవకుడిగా నేను అభివృద్ధిచెందుతున్నానా?''

విధేయతను గూర్చి వ్యక్తిగతమైన కొన్ని ప్రశ్నలను కూడా మనం అడుకోవాలి:

ప్రభువు ఆజ్ఞాపించిన తక్షణమే మనం విధేయులమౌతున్నామా? - లేక పేతురులా, ''వద్దు ప్రభువా, వద్దు'' అని అంటున్నామా? పేతురుయొక్క రెండవ బదులును మనం నేర్చుకోవలసియుంటుంది! ''నీ చిత్తమేమో అది నాపట్ల జరుగ నిమ్ము. అరకాలు మొదలుకొని నడినెత్తివరకు నన్నుకడుగుము'' తువాలు పాఠాన్ని నేర్చుకొనేలా దేవుడు మనకు సహాయం చేయును గాక! (ఆమెన్).

## మార్పులేని క్రీస్తు

గొప్ప నదులలో దేన్ని గూర్చియైనా చెప్పు- అది ఓర్‌నోట్సేగాని, రైనేగాని, లేదా హడ్సనేగాని- ఆ నది ప్రవాహానికి ఎత్తుగా నిలిచిన కొండలోని గొప్పబండ నిలిచినట్టు నీవు చూచావనుకో. శతాబ్దం వెంట శతాబ్దం గడచిపోయినా, దానిక్రింద ప్రవహించేది, ప్రవాహపు వేగాన్ని బట్టి మార్పుచెందుతుందేగాని, ఆ బండమాత్రం ఎప్పటికి అలాగే నిలిచియుంటుంది. దీనిని పోలి - కాలమూ, చరిత్ర అనేవి మారుతునే ఉంటాయిగాని ''యుగముల బండ'' యైన క్రీస్తు మాత్రం మార్పులేకయే ఉంటారు.

**కార్లస్ ఇ. మెకార్ట్నీ**

క్ష ఏ క్షఏ